

మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫర్నీచర్ దగ్ధం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫర్నీచర్ దగ్ధమైంది. విలువైన ఫైల్స్ ఏమీ దగ్ధం కాలేదని కమిషనర్ వెంకటరమణ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో విద్యుత్ సరఫరా అప్ అండ్ డౌన్ వల్ల అనేక రకమైన సమస్యలు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.




దగ్ధమైన ఫర్నీచర్

'జంగారెడ్డిగూడెం పట్టణంలో చిరు వ్యాపారి సంసోను సౌజన్య బ్యాగ్ల షాపు నడుపుతున్నాడు. స్మార్ట్ మీటర్ అమర్చక ముందు నెలకు రూ.514 బిల్లు వచ్చేది. అప్పట్లో అదనపు ఆదాయం కోసం చెరుకు మిషన్ ఉపయోగించేవాడు. ఇప్పుడు చెరుకు మిషన్ లేకపోయినా స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత గడిచిన జూన్, ప్రస్తుత జులై నెలలో విద్యుత్ బిల్లు రూ.900 వరకు వచ్చింది. ఒకేసారి రెట్టింపు బిల్లు వస్తుండడంతో చెల్లించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు.'


'ఏలూరు నగరానికి చెందిన సత్యనారాయణ పవర్‌పేటలో ఫ్రూట్ జ్యూస్ షాపు నడుపుతున్నాడు. స్మార్ట్ మీటర్ అమర్చక ముందు బిల్లు నెలకు రూ.1,300 వరకు వచ్చేది. ఇప్పుడు వర్షాకాలం జ్యూస్ల సీజన్ లేకపోయినా నెలకు రూ.1,900లకుపైగా విద్యుత్ బిల్లు వస్తోందంటూ లబోదిబోమంటున్నాడు. ఈ విధంగా ఒక్కసారిగా కరెంటు బిల్లు పెరిగితే మాలాంటి సామాన్యులు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.'

స్మార్ట్ మీటర్లతో బిల్లుల మోత..!

- 70 శాతం నుంచి వంద శాతం బిల్లులు అదనం
- స్మార్ట్ మీటర్ల అమరికతో వ్యాపారులు గగ్గోలు
- రెండు జిల్లాల్లో దాదాపు 80 వేల స్మార్ట్ మీటర్లు బిగింపు
- చిరువ్యాపారుల పరిస్థితి మరింత దారుణం
- గృహాలకు బిగిస్తే సామాన్య ప్రజానీకం విలవిలే..
- భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన



స్మార్ట్‌మీటర్ బిగించక ముందు బిల్లు రూ.514



స్మార్ట్‌మీటర్ బిగించిన తర్వాత జూన్ నెల బిల్లు రూ.928

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సంసోను, సత్యనారాయణలే కాదు. స్మార్ట్ మీటర్లు అమర్చిన వ్యాపారులంతా కరెంటు బిల్లులు కట్టలేక లబోదిబోమంటున్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి వచ్చాక అదానీకి దాసోహమై స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు దిగింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ముందుగా వ్యాపార దుకాణాలకు అమర్చాలని, తర్వాత విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే గృహాలకు ఏర్పాటు చేసే విధంగా ముందుకు సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 4,58,435 గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా మిగిలినవి కమర్షియల్, వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియలో విద్యుత్‌శాఖ అధికారుల జోక్యం లేకుండా అదాని నియమించుకున్న ఉద్యోగులే చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 200 మంది అదాని ఏర్పాటు చేసుకున్న ఉద్యోగులు ఈ పనిలో ఉన్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 34 వేల వ్యాపార విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం ఆరు లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉండగా తొలివిడతగా 2.10 లక్షల వ్యాపార దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించే విధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకూ 46 వేల వ్యాపార కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయ్యింది. స్మార్ట్ మీటర్ల బిగింపుతో బిల్లులు పెరిగిపోయి వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ.500 వరకూ బిల్లు కట్టే చిరు వ్యాపారులు సైతం ఇప్పుడు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. దాదాపు వంద శాతం బిల్లులు అదనంగా వస్తున్నాయి. కొంతమందికి 70 శాతం వరకూ బిల్లులు అదనంగా వస్తున్నాయి. స్మార్ట్ మీటర్లు బిగించిన వినియోగదారులకు విద్యుత్ బిల్లులు ఇవ్వడం ఆపేశారు. ఫోన్‌లోనే బిల్లు చూపిస్తోంది. ఆ ప్రకారమే చెల్లించుకోవాల్సి ఉంటుంది. దీంతో బిల్లు అదనంగా వచ్చినా ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు పట్టణంలోని పవర్‌పేటలో ఏ వ్యాపారిని కదిపినా స్మార్ట్ మీటర్ల బిగింపు తర్వాత వస్తున్న బిల్లులు చూపి ఘొల్లుమంటున్నారు. జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు ఇలా ప్రతి పట్టణంలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది.

గృహ వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన..

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రస్తుతం వ్యాపార దుకాణాలకు మాత్రమే జరుగుతోంది. విద్యుత్ బిల్లులు పెరుగుతున్న తీరు గురించి వ్యాపారులు చెబుతుంటే గృహ వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ బిల్లుల మోత భారీగా ఉండే పరిస్థితి రానుంది. స్మార్ట్ మీటర్లను ప్రజలు ప్రతిఘటించాలని ఇప్పటికే వామపక్షాలు, పలు ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రజలు పలుచోట్ల ఆందోళనలు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. అదానీ కోసం మోడీ, చంద్రబాబు ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు తెగబడ్డారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా తర్వాత ఆదాయాలు తగ్గి జనం ఆర్థికంగా నలిగిపోతున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమంటూ కూటమి హామీ ఇచ్చింది. వచ్చిన తర్వాత ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారీగా విద్యుత్ భారాలు మోపింది. స్మార్ట్ మీటర్ల ముసుగులో విద్యుత్ భారాలను ప్రజల నెత్తిన రుద్దుతున్న పరిస్థితి నెలకొంది.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యాన శుక్రవారం ఏలూరు రోడ్డు నుంచి మసీదు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సభకు ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు మడకం కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు ఎ.నాగమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం చూపుతోందన్నారు. ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీలతో ప్రజలపై భారాలు వేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, ఎం.సుధారాణి, టి.ముత్యాలమ్మ, కె.వసంత, ఎం.సమ్మక్క, శ్రీదేవి, కె.రామలక్ష్మి మాట్లాడారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు, ప్రజలు

గిరిజనుల భూముల కొనుగోలు ఆపాలి

రెండో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎల్‌టిఆర్ 1/70 చట్టం జిరాయితీ భూములను ఆర్అండ్ఆర్ కొనుగోలు ఆపాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గిరిజన సాగులో ఉన్న భూములను, ఎటువంటి భూరికార్డు పరిశీలించకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, దొడ్డిదారుల్లో బుట్టాయగూడెం తహశీల్దార్ ఆర్అండ్ఆర్ కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీన్ని తక్షణం నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనేతరులకు కొమ్ముకాస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న తహశీల్దార్ చలపతిరావును తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి గణపవరం గ్రామ పంచాయతీ బోర్డు మెంబర్లు, గ్రామస్తులు లేకుండా గ్రామ సభను బుట్టాయగూడెం తహశీల్దార్ ముగ్గురు భూస్వాములతో నిర్వహించి ఎల్‌టిఆర్ భూములను ఆర్అండ్ఆర్‌లో పెట్టడానికి పెద్ద ఎత్తున కమిషన్లు తీసుకోవడానికి ప్రయత్నించారని, గ్రామస్తులు అడ్డుకోవడంతో పోలీసుల సహకారంతో అక్కడి నుంచి జారుకున్నారని తెలిపారు. అవే భూములను ఆర్అండ్ఆర్‌లో కొనుగోలు చేయడానికి తహశీల్దార్ ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ఆయనను సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం ముత్యాలరావు, రెడ్డి గణపవరం గ్రామస్తులు పునుగులు సూర్యచంద్రం, బాబూరావు, చీమల రాజు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

వర్షాలకు ఎద్దువాగు కాజ్‌వే వద్ద కరుగుతున్న మట్టి రోడ్డు

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో, పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మూడు రోజులుగా గోదావరి నీటిమట్టం మళ్లీ క్రమక్రమంగా పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ఇంద్రావతి, కొండవాగుల జలాలు గోదావరిలో కలవడంతో నీటిమట్టం మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 3,00,032 క్యూసెక్కుల గోదావరి జలాలను జల వనరుల శాఖ అధికారులు స్పిల్‌వే 48 గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 28.800 మీటర్లు, దిగువన 19.000 మీటర్లు, ఎగువ కాపర్‌డ్యాం ఎగువన 28.900 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 18.200 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాంల మధ్య 15.850 మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వేలేరుపాడు రూరల్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం ఎగువన ఉన్న వాగులు, వంకలు పొంగి పొర్లడంతో జలాశయాల నుండి వరద ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి ఎరుపెక్కి క్రమీపీ పెరుగుతోంది. గురువారం 21 అడుగులున్న గోదావరి శుక్రవారం 25 అడుగులకు చేరుకోవడంతో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల్లో భయాందోళన నెలకొంది. ఇంకా వరద పెరుగుతుండడంతో సుమారు 30 అడుగులకు చేరుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. దీంతో రుద్రంకోట, రేపాక గొమ్ము, తాట్కూరు గొమ్ము తదితర గ్రామాల ప్రజలు గోదావరి పెరిగితే రోడ్లు దిగ్బంధమై ఇంటి సామగ్రిని మెరక ప్రాంతాల్లోకి తరలించడానికి ఇబ్బందిగా ఉంటుందని ముందుగానే కొంతమంది నిర్వాసితులు పునరావాస కాలనీలకు వెళ్లలేక మళ్లీ వచ్చి ఇక్కడే వ్యవసాయం చేసుకోవాలని మండలంలోని భూదేవిపేట, గుల్లవాయి మాదారం, మేడిపల్లి గ్రామాల్లో ఇళ్లను అద్దెకి తీసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో వచ్చిన వరదలకు రహదారులు తెగిపోవడంతో వేలేరుపాడు నుంచి రుద్రంకోట వెళ్లే రహదారిలో బ్రిడ్జి వద్ద, అలాగే ఎద్దు వాగు కాజ్‌వే పోసిన కంకర మట్టి కురుస్తున్న వర్షాలకు కరిగిపోతూ గండ్లు ఏర్పడుతూ ఉండడంతో ఈ వర్షాలకు ఇంకా మట్టి కరిగిపోయి రహదారులు ఉండవేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఎద్దువాగు కాజ్‌వే వద్ద కరుగుతున్న మట్టి రోడ్డు

కుక్కునూరు రూరల్ : నాలుగు రోజులుగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి భారీగా వరద పెరుగుతోంది. భద్రాచలంలో గురువారం 21 అడుగులు ఉన్న నీటిమట్టం శుక్రవారానికి 25.8 అడుగులకు చేరింది. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఏలూరు జిల్లా అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితిపై అధికారులకు శుక్రవారం మంత్రి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా, మండల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా నివారణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మెడికల్, అగ్రికల్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులందరూ అప్రమత్తతో ఉండి సమన్వయంతో పనిచేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాల కారణంగా వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద వరద నీటి ఉధృతి కారణంగా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నూజివీడు నియోజకవర్గంలో ఉద్యానవనాలు, తదితర పంట నష్ట వివరాలు పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా చెట్లు కూలి రవాణా సౌకర్యాలకు అంతరాయం కలగకుండా తక్షణం చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనుక్షణం ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి పార్థసారధి ఆదేశించారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పార్థిసారధి

అభివృద్ధి అంటే చంద్రబాబునాయుడే

తొలి అడుగులో మున్సిపల్ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అభివృద్ధి అంటే ముఖ్యమంత్రి చంద్రబాబే గుర్తొస్తారని రాష్ట్ర మున్సిపల్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు అమీనాపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రజలు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రజాప్రతినిధులంతా అందుబాటులో ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందేలా, సుస్థిరపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఆశయానికి తగ్గట్టుగా కార్యకర్తలంతా సమిష్టిగా పని చేయాలన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను మంత్రి ఫరూక్, ఎంఎల్ఎ చంటి అందజేశారు. అలాగే తన సొంత నిధులతో ఎంఎల్ఎ బడేటి చంటి మహిళకు తోపుడు బండి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, ఎపి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, పార్టీ పరిశీలకులు మీరా, ఎపి మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవానీ, ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

ఖరీఫ్ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

వ్యవసాయాధికారులతో జెసి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం రైతులకు లాభదాయకమైన సన్నరకం వరి వంగడాలు, ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా రైతులు వేసుకున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కనీసం ఈ సారి 50 శాతం తగ్గకుండా సన్న రకం వరి పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రానున్న పంటలకు 90 శాతం పైగా సన్న రకాలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన గోనె సంచులను అవసరానికి తగ్గట్టుగా నిల్వలు పెట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లు ఈసారి కొనుగోలులో పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలను తూతూమంత్రంగా చేయవద్దని, రైతులు ఎక్కువ మంది పాల్గొనేలా చూసి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పది సొసైటీల్లో ధాన్యం ఆరబెట్టేందుకు అవసరమైన ఫ్లాట్ ఫారమ్‌లు ఏర్పాటు చేసేందుకు స్థలం సేకరించాలని, ఉన్న ఫ్లాట్ ఫారమ్‌లకు మరమ్మతులు ఉంటే చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిని జెసి ఆదేశించారు. కోఆపరేటివ్ సొసైటీల వద్ద, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కార్యాలయం గోదాములు, రైతు సేవా కేంద్రాల వద్ద ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు, ఫ్లాట్ ఫారమ్‌లు, సోలార్ పవర్‌తో డ్రైయర్లు సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి, డిఎస్ఒ విలియమ్స్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కెఎస్ఎన్‌వి.కృష్ణ, జిల్లా కోఆపరేటివ్ అధికారి అరిమిల్లి శ్రీనివాస్, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ గిరిజ, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు సువిర ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

నాణ్యమైన, శాస్త్రీయ విద్య అందించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్

బుట్టాయగూడెం : విద్యార్థులందరికీ నాణ్యమైన, శాస్త్రీయ విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం మొదటి రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను అందని ద్రాక్ష లాగా చేస్తున్నాయన్నారు. విద్యాసంస్థలు ప్రారంభం కాగానే కొత్త విద్యా విధానాలతో అన్ని వసతులు సమకూర్చి విద్యార్థులకు స్వాగతం పలకాల్సింది పోయి అనేక సమస్యలతో ఇబ్బంది పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాక ముందు హామీలు ఇచ్చిందని, అధికారంలోకొచ్చాక సమస్యలను పరిష్కరించక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు సరైన హాస్టల్ లేదని, విద్యాబుద్ధులు చెప్పడానికి ఉపాధ్యాయులు రెండు మండలాల్లో లేరని చెప్పారు. వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, నూతన హాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, సహాయ కార్యదర్శి పవన్, జిల్లా కమిటీ సభ్యులు అమూల్య, శివాజీ, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణకు శాశ్వత భవనాలు నిర్మించాలి

విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు చేపట్టాలి

పొలసానిపల్లి గురుకులం, జూనియర్ కాలేజీని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి అంబేద్కర్ గురుకులం (బాలికల) పాఠశాల, జూనియర్ కాలేజీలో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడంతో పాటు, విద్యాసంవత్సరం కోల్పోతున్న విద్యార్థుల భవిష్యత్తు గురించి వారి తల్లిదండ్రుల భయాందోళనలను తెలుసుకునేందుకు సిపిఎం ప్రతినిధుల బృందం శుక్రవారం పాఠశాలను సందర్శించింది. సిపిఎం నేతలు విద్యార్థులతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదే క్రమంలో సిబ్బంది కొరత, ఇతర అంశాలు వారి దృష్టికి వచ్చాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు బృందానికి నాయకత్వం వహించారు. పాఠశాల విద్యార్థిని పాఠశాల ఆవరణలోనే ఆత్మహత్య చేసుకోవటం, కనీసంగా 60 ఏళ్ల జీవిత కాలం ఉండే పాఠశాల భవనాలు ఆకస్మికంగా కూలిపోవడం, ఇదే క్రమంలో నిర్మాణ నాణ్యత డొల్లతనం ఇతర అంశాలు వెలుగు చూశాయి. అనంతరం ఆర్.లింగరాజు మాట్లాడుతూ విద్యార్థుల రక్షణ కోసం శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. అప్పటివరకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినుల ఆత్మహత్యలు కొనసాగకుండా యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సంవత్సరం మే రెండో తేదీన పాఠశాల భవనాలు కుప్పకూలాయి. జూన్ 12వ తేదీ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యా సంవత్సరం కొనసాగించేందుకు అవకాశాలు లేకపోవడంతో ఇంటర్ చదువుతున్న విద్యార్థులను ద్వారకాతిరుమల గురుకులం పాఠశాలకు బదిలీ చేశారు. మిగిలిన వివిధ తరగతులకు చెందిన 511 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు యాజమాన్యం తెలిపింది. కాని భవనాలు పటిష్టంగా లేకపోవడం, విద్యార్థులకు ప్రాణ హాని కలిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, భయాందోళనకు గురైన విద్యార్థులు సుమారు 400 మంది పాఠశాలలో చేరలేదు. వారి విద్యాసంవత్సరం నష్టపోయే అవకాశం ఉంది. మిగిలిన 111 మంది విద్యార్థులు మాత్రమే భయాందోళన మధ్య విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఇదే నేపథ్యంలో పాఠశాల విద్యార్థి ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం వంటి సంఘటన వారి భయాందోళనలను మరింత ఎక్కువ చేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, బాధ్యులు విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని తగు రక్షణ చర్యలు చేపట్టడం, వారి విద్యా సంవత్సరం నష్టపోకుండా తగు ఏర్పాటు చేయటం వంటి కార్యక్రమాలు చేపట్టాలని లింగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమడోలు, ద్వారకాతిరుమల మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, నాయకులు పి.నాగరాజు, మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.



కూలిపోయిన భవనాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

వర్షం.. చిరు వ్యాపారులకు నష్టం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో గత రెండు రోజులుగా ఏలూరు నగరంలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా ముసురు పట్టి విరామం లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో గత రెండు రోజులుగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు నగరంలో చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడం, డ్రెయినేజీలు పొంగిపొర్లి రోడ్లపైకి రావడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. అలాగే ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు ఉండటంతో అవన్నీ తడిచిపోయి ఆ ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోతుంది. అలాగే రోడ్లమీద వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఈ వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వల్ల ప్రజలు రోడ్లపైకి రాక, బేరాలు లేక చిరు వ్యాపారులు ఖాళీగా కూర్చునే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తారనే ఆశతో రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు గొడుగులు వేసుకుని మరీ వినియోగదారుల కోసం ఎదురుచూశారు.



వర్షంలో చిరు వ్యాపారుల అవస్థలు

రేషన్ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

జిల్లా పౌరసరఫరాల అధికారి విల్సన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రేషన్ సరుకులు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి విల్సన్ హెచ్చరించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూజివీడు నియోజకవర్గ రేషన్ డీలర్లతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కార్డుదారులకు ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా రేషన్ డీలర్ల పంపిణీ పనితీరు, సరుకుల నాణ్యత, చెల్లింపు వివరాలు, వారి ప్రవర్తన విధానంపై కార్డుదారులు సంతృప్తిగా ఉన్నారా లేదా అనే అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, డీలర్లందరూ కార్డుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. సరుకులు కచ్చితమైన తూకంతో సమయపాలన పాటిస్తూ పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల సంతృప్తి చెందకుండా వ్యవహరించకూడదని డీలర్లను ఆదేశించారు. 65 ఏళ్లు పైబడిన కార్డుదారులకు ప్రతినెలా 26 నుంచి 31వ తేదీ వరకు వారి ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు. రేషన్ సరుకుల అక్రమరవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రేషన్ షాపులకు కేటాయించిన బియ్యం పూర్తిగా కార్డుదారులకు మాత్రమే పంపిణీ చేయాలన్నారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాలు చేయరాదని, ఆ విషయంలో క్షేత్రస్థాయి నిఘా ఉంటుందని చెప్పారు. డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బద్రు, పిడిఎస్ డిటి వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు కంప్యూటర్లు, టివి, ఫోన్ అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎంపిక చేసిన 16 శాఖా గ్రంథాలయాలకు రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవీ, స్మార్ట్ మొబైల్ ఫోన్ శివశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ బెంగళూరు వారు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు, జిల్లా మాస్టర్ ట్రైనర్ డి.సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ శివశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ బెంగళూరు వారు చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో 200 గ్రంథాలయాలను ఎంపిక చేశారన్నారు. దానిలో భాగంగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 16 గ్రంథాలయాలను ఎంపిక చేసి వీటిని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ సిబ్బంది జి.బుజ్జిబాబు, ఐ.రాజారావు, జి.కార్తీక్, జిల్లా కేంద్ర ఉప గ్రంథాలయ అధికారి ఎ.నారాయణరావు, సంస్థ సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంటువ్యాధుల నివారణకు కృషి అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

అపరిశుభ్రమైన పరిసరాలు అంటువ్యాధులు ప్రబలటానికి కారణమని, నివారణకు వైద్య ఆరోగ్యశాఖ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని జిల్లా సహాయ మలేరియా అధికారి గోవిందరావు కోరారు. భీమడోలులో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోవిందరావు హాజరయ్యారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అధికారులు భీమడోలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మలేరియాకు కారణమైన దోమల కారకాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ దోమల కారణంగా అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిలో భాగంగా పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, సిబ్బంది మురళి, చందు, నిఖిత, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ మనోజ్‌కు ఉపాధ్యాయుల సత్కారం

ప్రజాశక్తి - ముదినేపల్లి


డాక్టర్ మనోజ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు మనోజ్‌కు ఎపిటిఎఫ్ ముదినేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానం చేశారు. గత ఆదివారం డాక్టర్ మనోజ్ నంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ నాయకులు వైష్ణవి మనోజ్ హాస్పిటల్‌లో సాయంత్రం మనోజ్‌కు సన్మానం చేశారు. డాక్టర్ మనోజ్ పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు రికిల్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల నంది అవార్డు అందుకున్నారు. డాక్టర్ మనోజ్ పేదలకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం చేస్తూ ప్రజాసేవ చేయటానికి తనవంతు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మనోజ్‌కు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్, జాన్సన్ బాబు, కృపాకరం, రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో డిసిహెచ్ఎస్ తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ సతీష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను, ఓపి రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవలు, పారిశుధ్యం ఇంకా మెరుగు పరచాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రత్యేక గదులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మజారాణి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

జంగారెడ్డిగూడెం :రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్‌బాబు, సెక్రటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడి గ్రామంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించే శక్తి మహిళలకే ఉందన్నారు. అంగన్‌వాడీ టీచర్, డ్వాక్రా సిఏ కోసూరి రత్నమణి పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వ్యాన్‌ను ఆర్టీసి బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఏలూరు జాతీయ రహదారిలోని దుగ్గిరాల సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మూడో పట్టణ ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసి బస్సు కాకినాడ నుంచి బయలుదేరి విజయవాడ వైపు వెళ్తుంది. మినీ వ్యాన్ ఉల్లిపాయల లోడుతో రాజమండ్రి నుంచి గుంటూరు వెళ్తుంది. దుగ్గిరాల జాతీయ రహదారి సమీపంలోకి లోడుతో ఉన్న వ్యాన్ నెమ్మదిగా ఎత్తు ఎక్కుతుంది. వేగంగా వచ్చిన ఆర్టీసి బస్సు వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో వ్యాన్ రోడ్డు పక్కన పల్టీలు కొట్టింది. బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది, మూడో పట్టణ ఎస్ఐ రాంబాబు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. గాయపడిన మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వ్యాన్ యజమాని శ్రీనివాసరావు, ఆర్టీసి బస్సు డ్రైవర్ వి.రవిని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మూడో పట్టణ ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బట్టల దుకాణంలో చోరీ

ఏలూరు స్పోర్ట్స్ :నగరంలోని ఓ బట్టల దుకాణంలో బట్టలను, నగదును గుర్తు తెలియని ఆగంతకులు ఎత్తుకుపోయారు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండో పట్టణ పరిధిలోని వడ్డీలాపేటకు చెందిన కొట్టుపల్లి మాధవస్వామి నగరంలోని పవర్‌పేట గంగానమ్మ ఆలయం సెంటర్‌లో వినాయక ఫ్యాషన్ పేరుతో బట్టల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేసరికి షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బట్టలు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. సుమారు రూ.80 వేల విలువైన బట్టలు, రూ.పది వేల నగదు అపహరణకు గురైనట్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

ముసునూరు :బైండోవర్ అయి మళ్లీ ఎక్సైజ్ నేరానికి పాల్పడినందుకు మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎస్.దుర్గకు తహశీల్దార్ రూ.పది వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. బెల్లం వ్యాపారి లోపూడి గ్రామానికి చెందిన జల్లు హరి రామకృష్ణను తహశీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు.

జిల్లా కారాగారం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒకటో పట్టణంలోని జిల్లా కారాగారాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలలో జరిగే తనిఖీల్లో భాగంగా కారాగారాన్ని సందర్శించినట్లు చెప్పారు. కారాగారంలోని ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలు పరిశీలించి ఖైదీల కేసు వివరాలు, వారి కేసులను వాదించే న్యాయవాదుల వివరాలు తెలుసుకున్నట్లు వివరించారు. ఆర్థికంగా వెనుకబడి, న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయవాదిని నియమిస్తామని, వారి కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కారాగార పర్యవేక్షకులు సిహెచ్ఆర్‌వి.స్వామి, జైలర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బుల్లెట్ సైలెన్సర్లను తొలగించి వాటిని ధ్వంసం చేసే కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం నిర్వహించారు. ఎస్‌పి ఆధ్వర్యంలో తొలగించిన సైలెన్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బుల్లెట్ వాహనాలపై తిరుగుతూ పెద్ద శబ్దాలను చేస్తే కఠిన చర్యలు తీసుకుని, ద్విచక్రవాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని ఆర్‌టిసి సిబ్బందికి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం సూచించారు. పట్టణంలోని ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బస్టాండ్ పరిసరాల పరిశుభ్రత, పబ్లిక్ టాయిలెట్స్, తాగునీటి నిర్వహణ, ట్రాఫిక్ సెక్షన్ రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్‌టిసి గ్యారేజ్‌లోని బస్సులను తనిఖీ చేశారు. అన్ని బస్సులను తనిఖీ చేసి మెయింటెనెన్స్ పరిశీలించి సూపర్‌వైజర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం బస్సులో ప్రయాణిస్తూ రోడ్డు టెస్ట్ నిర్వహణను పరిశీలించారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో విద్యార్థులకు మహిళా రక్షణ, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవనకుమార్‌లు విద్యార్థులకు మహిళా రక్షణ, శక్తి యాప్ డౌన్‌లోడ్ ఉపయోగాలు, వినియోగం, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ట్రిసా పాల్గొన్నారు.

చింతలపూడి :విద్యార్థులు సరైన సమయపాలన, ధ్యానం, క్రీడలు వంటి మార్గాల ద్వారా మానసిక స్థైర్యాన్ని పొందవచ్చని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ సూచించారు. చింతలపూడి అర్పణ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు, ఫ్రెండ్ రిక్వెస్టులు, డేటా పంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, రోడ్డు భద్రత అంశాలపై ఎస్ఐ ఎం.జయబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం.జయబాబు మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బి.కృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటే ఆ బాధ్యత ఆ పాఠశాల ఉపాధ్యాయులుదేనని చెప్పారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

ఆగిరిపల్లి :ఆగిరిపల్లి కొండకాలనీ ప్రాంతంలో ఉన్న అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని కొండకాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు పంతగాని నానయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్న కొండకాలనీ ప్రాంతంలో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయన్నారు. రాత్రి సమయంలో పాదచారులు, వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గత 40 ఏళ్లుగా నివసిస్తున్న కొండకాలనీ వాసులకు ఎన్నికల సమయంలో పలు వాగ్దానాలు ఇచ్చి ఓట్లు వేయించుకుం టున్న నాయకులు అనంతరం పట్టించుకోవడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొండకాలనీ ప్రాంతంలో సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీ వ్యవస్థలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి కాలనీ వాసుల వెతలను తీర్చాలని, లేకపోతే కొండ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోషియేషన ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు తొలగింపు

ముసునూరు :మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు గోగులంపాడు నుంచి చెక్కపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు తొలగించినట్లు టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు తెలిపారు. నూజివీడు నుంచి చెక్కపల్లి మీదుగా లోపూడి, గుడిపాడు, గుల్లపూడి, వలసపల్లి, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, బసవరపాడు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా కంచి చెట్లు, ముళ్ల పొదలు మూసుకు పోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయం టిడిపి నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు వాటిని తొలగించారు. మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా తుమ్మ, కంచి చెట్లు, ముళ్ల పొదలను టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, గుడిపాడు గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, చెక్కపల్లి గ్రామ అధ్యక్షులు పెదబాబు, ముసునూరు ఉపసర్పంచి తోట శ్రీను, జోనుబోయిన రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో తొలగించారు.

రాత్రయితే ఆ బంకు పనిచేయదు..!

సౌకర్యాలూ లేవని వాహనదారుల ఆవేదన



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం గ్రామం దగ్గరలో హైవేపై ఉన్న భారత్ పెట్రోలియం బంకులో కనీస వసతులు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి తొమ్మిది గంటలు దాటితే అక్కడ పెట్రోల్ ఉండదని, బంకు పనిచేయదని, తాగునీరు, వాష్ రూమ్స్ సౌకర్యాలు ఉండవని చెబుతున్నారు. పగలు మాత్రమే బంకులో పెట్రోల్ కొట్టి రాత్రి పూట ఆపేస్తున్నారని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. హైవేలో బంక్ అంటే 24 గంటలూ అన్ని సౌకర్యాలతో పనిచేయాలని, కాని ఇక్కడ మాత్రం భిన్నంగా బంకు రాత్రివేళ పనిచేయదని, అలాగే కనీస వసతులు కూడా లేక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ బంకును నమ్ముకుని వాహనాల్లో ఇంధనం నింపుకుందామని వస్తే ఇబ్బంది పడాల్సిందేనని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బంకు రాత్రి వేళల్లో కూడా పనిచేసేలా, సౌకర్యాలు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

స్మార్ట్ మీటర్లను, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక


ప్రజాశక్తి - పోలవరం

స్మార్ట్ మీటర్లను, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కుంజం రామారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కారం భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు, కూటమి నేతలు విద్యుత్తు ఛార్జీలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకొచ్చాక ప్రజలను దోపిడీ చేయాలని చూస్తున్నారన్నారు. ఆగస్టు ఐదో తేదీన మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురసం లత, అరుణోదయ జిల్లా నాయకులు రెడ్డి, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కార్యదర్శి గురుగుంట్ల ప్రసాద్ రెడ్డి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బొరగం భూచంద్రరావు, తామా బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సముద్రాల సాయి కృష్ణ, గడ్డపల్లి సర్పంచి శారదమ్మ, ఉపసర్పంచి ముసలారెడ్డి పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పయనిస్తున్న నియోజకవర్గం

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు


ప్రజాశక్తి - భీమడోలు


సమస్యలు వివరిస్తున్న సిహెచ్‌సి వైద్యులు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంగుటూరు నియోజకవర్గం ప్రగతి పథం వైపు పయనిస్తుందని, ఇందుకు కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. శుక్రవారం ఆయన భీమడోలు మండలంలో పర్యటించారు. తొలుత భీమడోలు హై స్కూల్‌ను సందర్శించారు. అనంతరం పల్లె పల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా వడ్లపట్ల, అంబరుపేట, కురెళ్ల గూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి, పూళ్ల గ్రామాల్లో పర్యటించారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వారు లేవనెత్తిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భీమడోలు హై స్కూలులో 800 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణానికి, డైనింగ్ హాల్ ఏర్పాటుకు, మురుగు కాలువ నీటి వ్యవస్థను క్రమబద్ధీకరించడంతో పాటు పాఠ శాల ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పా టుకు హామీ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం, ఉప ప్రధానోపాధ్యాయులు జి.పద్మజ, సుల్తాన్ అహ్మద్ పాల్గొన్నారు. సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమా వేశంలో ఛైర్మన్ హోదాలో పాల్గొన్న ఎంఎల్ఎ దృష్టికి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాస్ ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. వైద్యుల కొరత, ఇతర అంశాల గురించి వైద్యులు ఆనంద్, రష్మీ, అపర్ణ వివరించారు. సమస్యల పరిష్కారానికి ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు


మందులు అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. జీలుగుమిల్లి ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మమత హాస్పిటల్‌చే శుక్రవారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపులో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. క్యాంపులో పలువురికి పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు మమత హాస్పిటల్ వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం మిషన్ హోప్ సంస్థ ద్వారా గ్రామానికి చెందిన పలువురు మహిళలకు రాయితీపై కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి జి.రవి, మండలాధ్యక్షులు పి.రాము, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ మనోజ్, మిషన్ హోప్ సంస్థ ప్రతినిధి జాషువా, అంబేద్కర్ యూత్ సభ్యులు శ్రీను, అరుణ్, ప్రభాకర్, సతీష్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్ఎఫ్ ఛైర్మన్


ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే తక్షణమే ఫిర్యాదు చేయవచ్చని ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. జీలుగుమిల్లిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, లేదా 949037405 నెంబర్‌కు వాట్సాప్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యను 60 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్థానిక భగత్ సింగ్ కాలనీకి విద్యుత్ సరఫరా లేదని, సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు బృందానికి ఫిర్యాదు చేశారు. దర్భగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఎంపిటిసి సుధారాణి వినతిపత్రం అందించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యుత్ సంబంధిత సమస్యలపై, పిఎం సూర్యఘర్ పథకంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు, స్వతంత్ర సభ్యులు మురళీకృష్ణ, ఆర్థిక సభ్యులు సుబ్బారావు, ఎడి ఇ కె.రమేష్, కళాశాల ప్రిన్సిపల్ సతీష్, ఎఇ నాగశేషు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- ముదినేపల్లి


నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న నరసింహారావు

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. మండలంలోని వడాలి గ్రామానికి చెందిన అనగాని పెద వెంకటేశ్వరరావు భార్య లీలావతి జ్ఞాపకార్థం 2024-25 విద్యా సంవత్సరంలో వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో స్కూలు మొదట స్థానం సాధించిన వై.ఉషశ్వినికి రూ.2,500, ద్వితీయ స్థానం సాధించిన ఎ.స్నేహలతకు రూ.2,500, 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు జి.కృపాశాంతి, ఎఎన్ఎస్‌వి.మణికంఠ, ఎన్‌డిజెవి.సుబ్రహ్మణ్యంలకు రూ.1,500 చొప్పున అలాగే తెలుగు మీడియంలో విఎన్.దుర్గ, ఎంవిఎన్ఎస్.ప్రసాద్‌లకు రూ.వెయ్యి చొప్పున నగదును టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పాఠశాల హెచ్ఎం వి.ప్రభుదాస్ చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో అనగాని దుర్గాప్రసాద్, పిఏసిఎస్ అధ్యక్షులు అనగాని గంగాధరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ గుర్రపు సుబ్రహ్మణ్యం, సభ్యులు పరశు రామయ్య, ఉపాధ్యాయులు నరసింహారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు సర్పంచి పొడుం పుష్ప శుక్రవారం ఉచితంగా రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శానిటరీ మేస్త్రి ఫణి మాట్లాడుతూ వర్షాకాలంలో పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు వారా నాని, వారా పోశియ్య, రవి, బంగారు వెంకటేశ్వరరావు, మాడుగుల పెద్దింట్లు, మాడుగుల సాయి పాల్గొన్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం

ముదినేపల్లి : కాకరవాడ గ్రామంలో కాలువలో గురువారం స్నానానికి దిగి గల్లంతైన మరీదు వెంకటేశ్వరరావు కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కైకలూరు అగ్నిమాపక సిబ్బంది గాలించినప్పటికీ వెంకటేశ్వరరావు ఆచూకీ తెలియరాలేదు. కాలువలో నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తుం ది. దీంతో గాలింపు చర్య కష్టతరంగా మారింది. కాలువ గట్టు వెంబడి పొదలను, చెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి విష జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. నీరు నిల్వ లేకుండా చూడాలని పేర్కొన్నారు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జ్వర లక్షణాలు ఉంటే ప్రభుత్వాసుపత్రిలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.

గన్నిని కలిసిన ఎక్సైజ్ నూతన సిఐ కళ్యాణి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఎక్సైజ్ సిఐగా నన్నపనేని కళ్యాణి నియమితులయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలతోనే మెరుగైన ఆరోగ్యమని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటమణి స్పష్టం చేశారు. మండవల్లి, కైకలూరు డివిజన్ల పరిధిలోని విఎఎలకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె శుక్రవారం పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. అల్లినగరం గ్రామంలో ఉన్న గౌతమ్ నాచురల్ ఆర్గానిక్స్ ప్రకృతి వ్యవసాయ కేంద్రం వద్ద ద్రావణాలు, కషాయం తయారు చేసే విధానంపై పూర్తిస్థాయిలో వివరించారు. అల్లినగరం, లింగాల గ్రామాల్లోని ఏ గ్రేట్ మోడల్స్, ఎటిఎం మోడల్స్ సందర్శించి గ్రౌండింగ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, వెంకటేష్, దివ్య, మాస్టర్ ట్రైనర్ అగస్టీన్, యూనిట్ ఇన్‌ఛార్జులు గౌతమ్ కుమార్, అహుబలరావు, నాగవిజయ, విఎఎలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ధరల పట్టిక ఉంచాలి

ప్రజాశక్తి - దెందులూరు

వికలాంగులకు, వృద్ధులకు ప్రతినెలా 26 నుంచి నెలాఖరులోపు ఇంటికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని, రేషన్ షాపుల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని దెందులూరు తహశీల్దార్ సుమతి ఆదేశించారు. ఆమె అధ్యక్షతన రేషన్ డీలర్లకు రేషన్ సరుకుల సరఫరాపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరల పట్టిక, షాపు పనిచేసే వేళలు, అధికారుల ఫోన్ నెంబర్లు షాపు వద్ద ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ టి.నాగరాజు, మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

వాహనదారులు వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామచంద్ర హెచ్చరించారు. మండవల్లి శివారు అప్పాపురం రోడ్డు వద్ద శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు లేకుండా, హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్న పది మందిపై కేసు నమోదు చేసి చలానా విధించినట్లు తెలిపారు.